

బెజ్జూర్: భాజ భజంత్రీలతో నృత్యం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కౌటాల: గుడ్లబోరిలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ రాందాస్, ఎంపీటీసీ వసంత్‌రావు

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- **బీఆర్ఎస్ కోనేరు సతీమణి కోనేరు రమాదేవి, కోడలు కోనేరు మధులిక విస్తృత ప్రచారం**



కాగజ్‌నగర్ పట్టణంలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి

కాగజ్‌నగర్, నవంబర్ 19 : కాగజ్‌నగర్ పట్టణంలో పలు కాలనీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి ఆదివారం జోరుగా ప్రచారం చేశారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి ఆడబిడ్డలకు, అన్నదమ్ములకు బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. మన ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటేసి కోనేరు కోనప్పను గెలిపించాలని ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ విడుదల చేసిన మ్యానిఫెస్టో కరపత్రాలు ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ సీపీ విద్యావతి, దస్తగిర్, కౌన్సిలర్ శివప్రసాద్, నాయకులు రాజ్‌కుమార్, సుబాన్ పాల్గొన్నారు.

- **కాగజ్‌నగర్ మండలంలో..**

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, నవంబర్ 19: ఇంటింటా ప్రచారంలో భాగంగా కాగజ్‌నగర్ మండంలంలోని నాగంపేట గ్రామపంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో కోనేరు ట్రస్టు చైర్మన్ వంశీ సతీమణి కోనేరు మధులిక ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేయలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ సర్కార్ ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నదని అందుకే ప్రభుత్వాన్ని మూడోసారి ఆశీర్వదించాలని కోనేరు మధులిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. సీఎం కేసిఆర్ అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణాను నంబర్ వన్ స్థానంలో ఉంచారన్నారు. సిర్పూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన కోనప్పను మరోసారి గెలిపిస్తే నియోజకవర్గన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కోనేరు మధులికతో పాటు సీనియర్ నాయకులు గజ్జి రామయ్య, లింగయ్య, రాములు, ధన్‌రాజ్, యువ నాయకులు పుల్ల శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **బెజ్జూర్ వార సంతలో ప్రచార హోరు..**

బెజ్జూర్, నవంబర్ 19 : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వారసంతలో బీఆర్ఎస్ నాయకులు ప్రచార జోరు పెంచారు. పార్టీ జెండాలతో డీజె బాక్సులతో, బాజా భజంత్రీలతో కార్యకర్తలు నృత్యం చేస్తూ ప్రచారం నిర్వహించారు. పాటల రూపంలో కేసిఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వివరణ ఒక వైపు కాగా కళాజాతా బృందంతో నృత్య ప్రదర్శనలతో మరోవైపు ప్రచార హోరు కొనసాగింది. అదే విధంగా స్క్రీన్‌లలో వివిధ అభివృద్ధి పనులు ఇతర వీడియోలు చూపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఓటు అభ్యర్థించారు. ఇతర పార్టీల ప్రచారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బలగాలతో ఎస్ఐ విక్రమ్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **కౌటాల మండలంలో..**

కౌటాల, నవంబర్ 19 : మండలంలోని గుడ్లబోరి గ్రామంలో ఆదివారం సర్పంచ్ ఫాలె రాందాస్, ఎంపీటీసీ ధనుకర్ వసంత్‌రావుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు జోరుగా ప్రచారం చేశారు. గ్రామంలోని అన్ని వాడల్లో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ విడుదల చేసిన మ్యానిఫెస్టో, ప్రస్తుతం అమలవుతున్న సం క్షేమ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేసిన సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. సర్పంచ్ రాందాస్, ఎంపీటీసీ వసంత్ రావులు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కోనప్పను అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, మన అభివృద్ధిని మనమే చేసుకోవాలని, ఎన్నికల వేళ పగటి వేష గాళ్లలాగా చాలా మంది వస్తుంటారు.. పోతుంటారని, కానీ స్థానికంగా ఉండేది ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుటుంబమేనని వారు పేర్కొన్నారు. వారి వెంట గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నా యకులు నాగేశ్వర్‌రావు, సంతోశ్, సాగర్ రావు, బాజీరావు, హుల్కే మోరేశ్వర్, బాలాజీ, వాయు, వంశీక్రిష్ణ, భీమన్న, సునీల్, మురళీ, రాజన్న ఉన్నారు..



కాగజ్‌నగర్ మండలంలోని నాగంపేటలో ఓటు అభ్యర్థిస్తున్న కోనేరు మధులిక



బెజ్జూర్: వారసంతలో కళాజాతా బృందం ద్వారా ప్రచారం

## రేపు మహాపాదయాత్ర

కాగజ్‌నగర్, నవంబర్ 19: కాగజ్‌నగర్ పట్టణంలోని హనుమాన్ ఆలయం నుంచి సిర్పూర్(టీ) మండలంలోని టొంకిని వరకు మంగళవారం మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే 22వ మహాపాదయాత్ర కొనసాగుతుందని, భక్తులు పాదయాత్రలో అధికసంఖ్యలో పాల్గొని ఆ భగవంతుడి కృషకు పాత్రులు కావాలని కోరారు.

## కోదండ రామాలయంలో పూజలు

రెబ్బెన, నవంబర్ 19: గోలేటిటౌన్‌షిప్ కార్మిక కాలనీలోని కోదండ రామాలయంలో ఆదివారం ఆకాశ దీపం పూజలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంతోశ్‌శర్మ ఆధ్వర్యంలో ఆకాశదీపానికి పూజలు నిర్వహించి దీపం పైకి ఎత్తి పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతి రోజు ఆకాశదీపం పూజలు నిర్వహించి దీపం పైకి ఎత్తడం జరుగుతుందని ఆలయ అర్చకుడు పేర్కొన్నారు.



గోలేటి కోదండ రామాలయంలో ఆకాశదీపం పూజలు చేస్తున్న భక్తులు

## మహిళా ఓట్లే అధికం

దస్తురాబాద్, నవంబర్ 19 : ప్రస్తుత శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం మండలంలోని 20 పోలింగ్ బూత్‌లలో 12,705 మంది ఓటర్లున్నారు. ఇందులో 6,505 మంది మహిళలు, 6,199 మంది పురుషులు ఉన్నారు. పురుషుల కంటే 306 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. కాగా, అక్టోబర్ 4న ప్రకటించిన తుది జాబితా కంటే ఈ జాబితలో 63 మంది ఓటర్లు పెరిగారు. అత్యధికంగా దస్తురాబాద్‌లో 1993 మంది ఓటర్లు, అత్యల్పంగా ఎర్రగుంటలో 256 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు.

## భక్తి మార్గమే అత్యుత్తమమైనది



పల్లకీ మోస్తున్న జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్

ఉట్నూర్, నవంబర్ 18 : ప్రపంచంలో భక్తిమార్గమే అత్యుత్తమైనదని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం పండరిపూరి భక్తులకు ఇంట్లో ఆశ్రమం ఇచ్చి, భోజనాలు పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పండరిపూరి యాత్ర యేటా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ప్రారంభమై, ఉట్నూర్ మీదుగా సాగుతుందన్నారు. పండరిపూరి యాత్రలో తాను పాల్గొంటానని తెలిపారు. అలాగే భక్తులకు తోచిన సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. నేటి సమాజంలో ప్రజల వద్ద సమయం లేక భక్తికి దూరమవుతున్నారన్నారు. భక్తి మార్గానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ జడ్పీటీసీ రాథోడ్ చారులత, భక్తులు, మహారాజ్‌లు పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

ఖానాపూర్ రూరల్, నవంబర్ 19 : మండలంలోని గొసంపల్లి గ్రామానికి చెందిన భూక్యా రాజు 15 లీటర్ల గుడుంబాను బావపూర్ (కే) గ్రామానికి తరలిస్తుండగా, ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. సీఐ సంపత్ కృష్ణ, ఎస్ఐ రాయబారపు రవి కూమార్, గౌతం, వెంకటేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

## ఓటుహక్కు వినియోగించుకోవాలి



పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ, ఎస్ఐ సునీల్

ఇంద్రవెల్లి, నవంబర్19 : ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ డీ సునీల్ సూచించారు. మండలంలోని కెస్లాపూర్, పిట్టబొంగురం, దస్నాపూర్, డొంగర్‌గాం, భీంజీతండా, హర్కాపూర్ తండా గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. సమస్యలతోపాటు, కల్పించే సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం గ్రామాల్లోని ప్రజలతోపాటు ఓటర్లకు ఎన్నికల నిబంధనలతోపాటు, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టి, ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు పోలీస్ శాఖ తరపున అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.